www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 23 జనవరి 2024
5
తిరుపతి



జగనన్నకు చెప్పనుబోతే అరెస్టు చేస్తారా..!

అంగన్వాడీల అక్రమ అరెస్టులపై నిరసనలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: అంగన్వాడీలు తమ న్యాయపరమైన సమస్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి వివరించేందుకు విజయవాడకు వెళితే అక్రమంగా అరెస్టు చేస్తారా అంటూ కార్మిక సంఘాల నాయకులు మండిపడ్డారు. విజయవాడలో అంగన్వాడి నాయకుల అరెస్టులు, నిర్బంధానికి వ్యతిరేకంగా సోమవారం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద సిఐటియు, ఏఐటీయూసీ, ఐఎఫ్టియు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య మాట్లాడుతూ అంగన్వాడీల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్వాడీలు తమ జీతాలను పెంచమని అడగడం గొంతెమ్మ కోర్కేమీ కాదనీ, పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా వారి డిమాండ్ సబబేనని స్పష్టం చేశారు. అంగన్వాడీల నిరవధిక సమ్మె నెలన్నర రోజులకు చేరుకున్నా గానీ, ప్రభుత్వంలో ఎలాంటి స్పందన లేకపోగా వారి ఉద్యమాన్ని అణచివేసే ధోరణిలోనే ముందుకు పోవడం బాధాకరమన్నారు. దీంతో అంగన్వాడీలు కోటి సంతకాలతో జగనన్నకు చెబుదామని విజయవాడ బయలుదేరితే ఎక్కడికక్కడ అరెస్టు చేసి నిర్బంధించడం జగన్ నిరంకుశత్వానికి పరాకాష్టగా నిలుస్తుందని ధ్వజమెత్తారు. ఇకనైనా ప్రభుత్వ తీరులో మార్పు రాకుంటే భవిష్యత్తు ఉద్యమం మరింత ధాటిగా ఉంటుందని హెచ్చరించారు. ఏఐటీయూసీ నాయకులు జనమాల గురవయ్య, మించిల శివకుమార్, గోపి, సిఐటియు నాయకులు వెంకటేష్, సంక్రాంతి వెంకటయ్య, గురునాథం, అన్వర్ బాషా, ఈశ్వరయ్య అంగన్వాడీలు పాల్గొన్నారు.

తిరుపతి టౌన్: అంగన్వాడీలు కోటి సంతకాలతో జగనన్నకు చెబుదాం అంటూ ఆదివారం తిరుపతి నుంచి విజయవాడకు బయలుదేరారు. అయితే ఆదివారం రాత్రి కావలిలో అంగన్వాడీలను పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లో నిర్బంధించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇదే రకమైన వైఖరితో అన్ని పోలీస్ స్టేషన్లో నిర్బందించారు. ప్రభుత్వం అంగన్వాడీలపై ధమనకాండకు పాల్పడడాన్ని నిరసిస్తూ సోమవారం పాత మున్సిపల్ కార్యాలయం వద్ద కళ్ళకు నల్ల రిబ్బన్లు కట్టుకొని నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ అంగన్వాడీ ఆడబిడ్డలపై ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి అడుగడుగునా పోలీసులతో దమన కాండకు పాల్పడటాన్ని తప్పు పట్టారు. అంగన్వాడీలు చేస్తున్న పోరాటానికి సిపిఎం అండగా ఉంటుందన్నారు. అంగన్వాడీలు విధుల్లో చేరకపోతే విధుల నుండి తొలగిస్తామని ప్రభుత్వం బెదిరించడాన్ని ఖండించారు. అంగనవాడీల పోరాటాన్ని అణచివేయాలని చూస్తే ప్రభుత్వం పతనం కావడం ఖాయమన్నారు. పోరాటాన్ని మరింత ఉధతం చేస్తామని, అవసరమైతే రాష్ట్రబంద్‌కు కూడా వెనకాడబోమని హెచ్చరించారు. డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.జయ చంద్ర, ఐద్వా జిల్లా కార్యదర్శి పి.సాయి లక్ష్మి, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు ఎం.జయంతి, ఆటో డ్రైవర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి తంజావూరు మురళి, సిపిఎం నగర కార్యదర్శి టి.సుబ్రమణ్యం, టిటిడి కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు డి.పార్థసారథి రెడ్డి, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎండి శ్రీనివాసులు పాల్గొన్నారు.

వెంకటగిరి: అంగన్వాడీలు చేపట్టిన సమ్మె సోమవారం నాటికి 42వ రోజుకు చేరింది. విజయవాడలో జరుగుతున్న అంగన్వాడీల అక్రమ అరెస్టులను ఖండిస్తూ బంగారుపేట ఏరియాలో ర్యాలీ నిర్వహించారు. సిఐటియు తిరుపతి జిల్లా కమిటీ సభ్యులు వడ్డిపల్లి చెంగయ్య, ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మండల అధ్యక్షులు సుభాషిని, ప్రాజెక్ట్ లీడర్ నిర్మల, మల్లీశ్వరి పాల్గొన్నారు.

అంగన్వాడీలపై నిర్బంధాన్ని ఆపండి

బెదిరింపులు మాని సమస్య పరిష్కారానికి కృషి చేయండి

జిల్లా కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి అఖిలపక్షం వినతి

తిరుపతి టౌన్: అంగన్వాడీలపై రాష్ట్రంలో సాగుతున్న అణిచివేత దోరణులను తక్షణం ఉపసంహరించుకోవాలని, వారిపై నిర్బంధాన్ని ఆపివేయాలని తొలగింపుల పేరుతో సాగుతున్న డ్రామాలు ఆపి వారి న్యాయమైన సమస్యల పరిష్కారానికి తోడ్పడాలని తిరుపతి జిల్లా అఖిలపక్ష నేతలు కలెక్టర్ వెంకట రమణారెడ్డి ద్వారా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జి.నరసింహ యాదవ్, పులివర్తి సుధ, మనోహరాచారి (తెలుగుదేశం) వి.నాగరాజు, కందారపు మురళి, ఎస్.జయచంద్ర, పి.హేమలత (సిపిఎం), పూతలపట్టు అంజయ్య (రిపబ్లికన్ పార్టీ), మురళి (కాంగ్రెసు)లు కలెక్టర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

రేణిగుంట: రేణిగుంట ప్రాజెక్టు పరిధిలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ నిరసన సమ్మె సోమవారం నాటికి 43వ రోజుకు చేరుకుంది. రేణిగుంట అంబేద్కర్ విగ్రహం వద్ద వద్ద అంగన్వాడీల అక్రమ అరెస్టులను నిరసిస్తూ ధర్నా చేశారు. సిఐటియు నాయకులు నర్సింహారెడ్డి, సిపిఎం నాయకులు ఓ.వెంకట రమణ, ప్రజానాట్యమండలి మండల నాయకులు సెల్వరాజ్, రాజశేఖర్, సత్యశ్రీ పాల్గొన్నారు.

పిచ్చాటూరు: అంగన్వాడీ వర్కర్లు తలపెట్టిన చలో విజయవాడకు రాష్ట్రవ్యాప్తంగా వెళ్లనున్న అంగన్వాడీలకు అనుమతి లేదంటూ పోలీసులు ఎక్కడికక్కడ నోటీసులు ఇచ్చి కట్టడి చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్యాయంగా మహిళలపై పోలీసు నిర్బందాలను ప్రయోగించి న్యాయమైన సమస్యలపై పోరాడుతున్న తమని అణచివేయాలని చూడటం సరైన పద్ధతి కాదని అన్నారు.

గూడూరు టౌన్: రాష్ట్ర ప్రభుత్వం పోలీసుల నిర్బంధాలు, అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని అంగన్వాడీ యూనియన్ అధ్యక్షురాలు ఏ.ఇంద్రావతి, కార్యదర్శి బిఎస్.ప్రభావతి, రైతు సంఘం నాయకులు జోగి శివకుమార్, సిఐటియు పట్టణ అధ్యక్షులు బివి.రమణయ్య, కార్యదర్శి యస్.సురేష్ పేర్కొన్నారు. అంగన్వాడీలను అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ పట్టణంలోని టవర్‌క్లాక్ సెంటర్లో నిరసన తెలిపారు.

సరి చేశారా..?

- నాయకులు చెప్పినట్టు చేశారా..!
- ఇంటింటికీ తిరగకుండానే దరఖాస్తుల పరిష్కారం
- తుది ఓటర్ల జాబితాపై సందేహాలు
- జిల్లాల్లో 17.79 లక్షల మంది ఓటర్లు
- అత్యధికంగా 9.10 లక్షలు మహిళా ఓటర్లు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్

తుది ఓటర్ల జాబితా వచ్చేసింది. దొంగ ఓట్లు ఎక్కువగా ఉన్నాయని ప్రతిపక్ష పార్టీలు పలు అభ్యంతరాలు తెలియజేయడమేకాకుండా, ఫిర్యాదు చేయడం జరిగింది. ఇది ఓటరు జాబితాలో అధికారులు దొంగఓట్లు నివారించే సరిదిద్దారా? లేక నాయకులు చెప్పినట్టే చేశారా అనేది తుది ఎన్నికల జాబితా చూసిన తరువాతే తెలిసే అవకాశం ఉంది.

తిరుపతి జిల్లాలో 17.79 లక్షల మంది ఓటర్లు ఉన్నట్టు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వెంకట రమణారెడ్డి సోమవారం ప్రకటించారు. ఇందులో మహిళా ఓటర్లు ఎక్కువ మంది ఉన్నట్లు తెలిపారు. మహిళా ఓటర్లు 17.79 లక్షల మంది ఉండగా పురుష ఓట్లు 8.69లక్షలు ఉన్నట్టు ప్రకటించారు. ఇందులో ట్రాన్స్‌జెండర్లు 597 మంది ఓటర్లు ఉన్నట్టు తెలిపారు. ఏడు నియోజకవర్గాల పరిధిలో 20130 పోలింగ్ కేంద్రాలు ఉన్నట్టు విడుదల చేశారు.

ఇంటింటికీ తిరిగారా..?

జిల్లాలో ఓటరు నమోదు.. తొలగింపులు.. మార్పులు చేర్పులకు లక్షలాది దరఖాస్తులు వచ్చాయి. బీఎల్వోలు ఇంటింటికీ తిరిగి దరఖాస్తులు పరిశీలించాల్సి ఉండగా.. మొక్కుబడిగా ముగించారు. ఇళ్లకు వెళ్లకనే.. కార్యాలయాల్లో కూర్చుని పరిష్కరించేశారు. పర్యవేక్షించాల్సిన అధికారులు అధికార పార్టీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గారు. ఫలితంగా ముసాయిదా ఓటరు జాబితాలో పెద్దఎత్తున తప్పులు దొర్లాయి. వీటిపై చర్యలు చేపట్టాలని.. అక్రమాలు అరికట్టాలని ప్రతిపక్ష నేతలు విన్నవించినా పట్టించుకున్న దాఖలాలు లేవు. ఈ నేపథ్యంలో సోమవారం విడుదలయ్యే తుది జాబితా పారదర్శకంగా ఉంటుందా? లేదా? అని అందరూ ఎదురుచూస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో కొత్తగా ఓటరు నమోదు, తొలగింపులు, మార్పులు చేర్పులకు బీఎల్వోలు ఇంటింటికీ వెళ్లి పరిష్కరించాల్సి ఉండగా చాలా ప్రాంతాల్లో తిరిగిన దాఖలాలు లేవు. ప్రత్యేక ఓటరు నమోదుచ, సవరణ సమయంలో వచ్చిన దరఖాస్తులను సైతం బీఎల్వోలు ఇంటింటికి తిరగకుండానే పరిష్కరించేసినట్లు చూపారు. అన్ని నియోజకవర్గాల పరిధిలోని ఓటరు జాబితాలో మత పేర్లు అధికంగా ఉన్నాయి. ఐదు, పది, ఇరవై ఏళ్ల కిందట చనిపోయిన వ్యక్తుల వివరాలు ముసాయిదా ఓటరు జాబితాలో ప్రత్యక్షమయ్యాయి. దీనికి తోడు ఒకే ఇంటి నంబరుపై వందల సంఖ్యలో ఓటర్లు ఉండటం.. ఇంటి నంబర్లు లేకుండానే ఓటర్లు ఉన్న ఘటనలు ఉన్నాయి. ప్రతి పోలింగ్ కేంద్రంలో 40 నుంచి 50కి పైగా మతుల వివరాలు జాబితాలో ఉన్నాయి. స్థానికేతరులకు ఓట్లు ఉండటం, దీర్ఘకాలికంగా వలస వెళ్లినవారు, వివిధ ప్రాంతాల్లో ఉద్యోగాలు చేసినవారు కొన్నేళ్ల కిందటే ఇతర ప్రాంతాలకు బదిలీ అయ్యారు. వారి ఓట్లు జాబితాలో పదిలంగా ఉండటం గమనార్హం.

తొలగింపులకు 2లక్షల పైగా విన్నపాలు

జిల్లాలో ఓటర్ల తొలగింపులకు సంబంధించి 2 లక్షల పైనే దరఖాస్తులు వచ్చాయి. కొందరు బీఎల్వోలు కార్యాలయాల్లో కూర్చొని, వైసిపి నేతలకు తలొగ్గి విపక్ష పార్టీల ఓట్లను తొలగించారన్న ఆరోపణలు ఉన్నాయి. కొత్తగా ఓటరు నమోదుకు సుమారు 2 లక్షల పైగా దరఖాస్తులు వచ్చాయి. వాటిని అదే స్థాయిలో బీఎల్వోలు విచారించి ఓటరు జాబితాలో చేర్పులు చేయడం గమనార్హం. వాస్తవానికి సంబంధిత వ్యక్తి ఆ చిరునామాలో ఉన్నారా? లేదా? అని విచారించలేదు. సచివాలయాల్లో కూర్చొని దరఖాస్తులు పరిష్కరించేశారని ప్రతిపక్ష నేతలు ఆరోపించారు.

వెబ్‌సైట్‌ల్లో వివరాలు...

ముసాయిదా ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పుల ప్రక్రియ ముగియడంతో ఓటర్ల జాబితా ముద్రణ సాగుతోంది. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో 12 సెట్ల జాబితాలు సిద్ధం చేయాలి. ఈసీ గుర్తించిన ఏడు రాజకీయ పార్టీలతోపాటు ఎన్నికల అధికారులకు ఒక్కో సెట్ అందించాలి. ఈసీ వెబ్సైట్లో పోలింగ్ కేంద్రాల వారీగా జాబితాను అందుబాటులో ఉంచనున్నారు.

ఎన్ని విచిత్రాలో...

గతంలో ఒకే పోలింగ్ కేంద్రంలో భార్యాభర్తలు ఓటేస్తే ప్రస్తుత ముసాయిదా ఓటరు జాబితాలో భార్య ఒక పోలింగ్ కేంద్రంలో, భర్త మరో పోలింగ్ కేంద్రంలో ఓటర్లుగా ఉన్నారు. ఇంటి పేరు తెలుగులో.. ఓటరు పేరు ఇంగ్లీష్.. వారి చిత్రాలు తలకిందులు కావడం.. మహిళల బదులు పురుషుల చిత్రాలు ప్రచురితమయ్యాయి. కర్నూలు నియోజకవర్గ పరిధిలోని ఓటర్ల పేర్ల వద్ద 'స రి గ మ ప ద ని స' అని ప్రచురితమ్వడం గమనార్హం. కర్నూలు పార్లమెంట్ పరిధిలోని ఎనిమిది నియోజకవర్గాల్లో దొంగ ఓట్లు ఉండటం.. ఒకే వ్యక్తికి రెండు, మూడు ఓట్లున్నాయని, వందలాది మంది రెండు, మూడు నియోజకవర్గాల్లో ఓటర్లుగా ఉన్నారని ప్రతిపక్ష పార్టీల నేతలు పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేశారు.

ఎన్నికల కమిషన్ చర్యలతో...

ఓటర్ల జాబితాలో అక్రమాలకు పాల్పడిన అధికారులపై ఎన్నికల సంఘం చర్యలకు ఉపక్రమించడంతో అధికార పార్టీ నేతలకు సహకరించిన సిబ్బంది గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ప్రతిపక్ష పార్టీల సానుభూతిపరుల ఓట్ల తొలగింపు లక్ష్యంగా పెద్దఎత్తున ఫారం-7 దరఖాస్తులు ఆమోదించిన అధికారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఓటర్ల జాబితా ప్రక్రియ అంతా ఆన్లైన్లో జరగడంతో ఏ స్థాయిలో తప్పు చేసినా బాధ్యులను గుర్తించే వెసులుబాటు ఉండడం వారిని మరింత ఆందోళనకు గురి చేస్తోంది. ఓటర్ల తుది జాబితా సోమవారం విడుదల చేశారు. ఈ నేపథ్యంలో తాము ఇచ్చిన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని జాబితాలు రూపొందించారా? లేదా? అని విపక్ష నేతలు పరిశీలించనున్నారు. అనంతరం ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయనున్నారు.

జిల్లాలో 17,79,000 మంది ఓటర్లు

ప్రతి నియోజకవర్గంలో పెరిగిన ఓటర్లు

అత్యధికంగా చంద్రగిరిలో 3 లక్షల 8వేల మంది

తిరుపతి నియోజకవర్గంలో 2 లక్షల 98 వేల మంది

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: ఓటర్ల తుది జాబితాను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకట రమణారెడ్డి సోమవారం ప్రకటించారు. గతం కంటే ఈసారి అన్ని నియోజకవర్గాల్లో ఓటర్ల సంఖ్య పెరిగింది. తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గంలోని తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తి, సత్యవేడు, సులూరుపేట, గూడూరు, వెంకటగిరి నియోజకవర్గంలో ఓటర్ల సంఖ్య పెరిగింది. అత్యధికంగా చంద్రగిరి నియోజకవర్గంలో 3 లక్షల 8 వేల 916 ఓటరులో ఉన్నారు. ఇందులో మహిళ ఓటర్లు 1,58,607మంది ఓటర్లు ఉన్నారు. పురుషులు 1,50,249 మంది ఓటర్లు ఉన్నారు. 395 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. తిరుపతి అసెంబ్లీలో 2,98,239 మంది ఓటర్లు ఉన్నారు. గతం కంటే ఈసారి బాగా ఓటర్ల సంఖ్య పెరిగింది. ఇందులో మహిళా ఓటర్లు 1,50,100 మంది ఓటర్లు కలిగి ఉన్నారు. పురుషులు 1,48,101 మంది ఓటర్లు కలిగి ఉన్నారు. ఇందులో పోలింగ్ కేంద్రాలు 267కలిగి ఉన్నాయి. శ్రీకాళహస్తి నియోజవర్గంలో 2,43,197 మంది ఓటర్లు కలిగి ఉన్నారు. ఇందులో మహిళా ఓటర్లు 1,25,546 మంది కలిగి ఉన్నారు.పురుష ఓటర్లు 1,17,635 మంది కలిగి ఉన్నారు. 293 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. గూడూరు ఎస్సీ నియోజకవర్గం మొత్తం ఓటర్లు 2,40,388 మంది కలిగి ఉన్నారు.ఇందులో మహిళా ఓటర్లు 1,23,371 మంది కలిగి ఉన్నారు. పురుష ఓటర్లు1,16,982 మంది కలిగి ఉన్నారు. పోలింగ్ కేంద్రాలు 294 ఏర్పాటు చేశారు. వెంకటగిరి నియోజకవర్గంలో 2,39,240 మంది ఓటర్లు కలిగి ఉన్నారు. ఇందులో మహిళా ఓటర్లు 1,22,300 మంది ఉన్నారు. పురుష ఓటర్లు 1,16, 936 మంది ఉన్నారు. 298 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. సూళ్లూరుపేట ఎస్సీ నియోజకవర్గం మొత్తం ఓటర్లు 2,37,700 మంది ఓటర్లు కలిగి ఉన్నారు. ఇందులో మహిళా ఓటర్లు 1,21,876 మంది ఉన్నారు.పురుష ఓటర్లు 1,15,802 మంది ఓటర్లు ఉన్నారు. మొత్తం పోలింగ్ కేంద్రాలు 304 ఏర్పాటు చేశారు. సత్యవేడు ఎస్సీ అసెంబ్లీకి మొత్తం ఓటర్లు 2,11,378 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో మహిళా ఓటర్లు 1,08,797 మంది కలిగి ఉన్నారు. మహిళా ఓటర్లు 1,02,568మంది ఓటర్లు ఉన్నారు. పోలింగ్ కేంద్రాలు 279 ఏర్పాటు చేయడం జరిగింది.

'కాంట్రాక్ట్ కార్మికులకు జీతాలు పెంచండి'

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: మున్సిపల్ కార్పొరేషన్ ఇంజనీరింగ్ విభాగంలో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికులకు జీతాలు పెంచాలని సోమవారం డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమంలో వినతిపత్రం ఇచ్చారు. ఈసందర్భంగా నగరపాలక సంస్థ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు దేవేంద్ర మాట్లాడుతూ గత నెలలో ప్రభుత్వం విడుదల చేసిన జీవో ప్రకారంగా నేచురల్ ఆఫ్ వర్క్ ఇంజనీరింగ్ విభాగంలోని వివిధ సెక్షన్లలో పనిచేస్తు అన్‌స్కిల్డ్ కింద జీతభత్యాలు తీసుకుంటున్న వారికి, వారి సెక్షన్ ఆధారంగా స్కిల్డ్, సెమీస్కిల్డ్ కింద ఎవరెవరు వస్తారో, వారికి జీతభత్యాల పెంపుపై 9 మందితో కూడిన కమిటీని ప్రభుత్వం నియమించిందన్నారు. ఈసందర్భంగా నగరపాలక సంస్థ కమిషనర్‌ను కలిసి జీతభత్యాల పెంపు, ఐడెంటి కార్డు కొరకు అర్జీ అందజేశారు. కమిషనర్ హరిత స్పందించి కార్మికులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ధనుంజయులు సిద్ధయ్య నాయుడు, కరిముల్లా, బాలాజీ, చంద్ర, హరీష్, తదితరులు పాల్గొన్నారు.

మెగా మట్టి 'దోపిడీ'

- పరిమితికి మించి తవ్వకాలు
- రోడ్లు, వీధులు ధ్వంసం
- ప్రజలు, రైతుల్లో వ్యతిరేకత అయినా లెక్కచేయని వైనం
- అధికార యంత్రాంగానికి మూమూళ్లే మామూళ్లు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

జాతీయ రహదారి పనుల విస్తరణ పేరిట ఆ పనులు చేపడుతున్న మెగా కంపెనీ మట్టి దోపిడీకి పాల్పడుతోందన్న విమర్శలు వస్తున్నాయి. అనుమతులు లేకున్నా పరిమితికి మించి ఇబ్బడి ముబ్బడిగా మట్టి తవ్వకాలు చేస్తూ అటు పర్యావరణానికీ, ఇటు గ్రామీణులకు ముప్పు తెచ్చి పెడుతున్నారంటూ ప్రజలు మండిపడుతున్నారు. అనుమతులు ఒకచోట.. తవ్వేది మరోచోట..! అనుమతులున్న చోట పరిమితులు దాటి అపరిమితంగా తవ్వకాలు చేస్తూ మెగా మట్టి దోపిడీకి తెగబడుతున్నారన్న ఆరోపణలు పెచ్చుమీరుతున్నాయి. ప్రభుత్వ భూముల్లో, చెరువుల్లో మట్టి తవ్వే క్రమంలో ఆయా గ్రామాల ప్రజలు, రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నా మెగా యాజమాన్యం లెక్కచేయడం లేదు. మెగా యాజమాన్యానికి స్థానిక అధికార పార్టీ నేతల అండతో పాటు ప్రభుత్వ యంత్రాంగం ఆశీస్సులు మెండుగా ఉండటంతో వారు ఆడిందే ఆటగా, పాడిందే పాటగా మారుతోందన్న విమర్శలు ఉన్నాయి.

చెన్నయ్- బెంగుళూరు మధ్య దూరాన్ని, ప్రయాణ సమయాన్ని తగ్గించేందుకు ఎన్‌హెచ్-71 జాతీయ రహదారి పురుడు పోసుకుంది. నాయుడుపేట వద్ద గల చెన్నయ్- కోల్‌కత్తా జాతీయ రహదారి-16 నుంచి ప్రారంభమై మదనపల్లి వరకు 170 కిలోమీటర్ల మేర ఎన్‌హెచ్-71 జాతీయ రహదారి సాగుతుంది. రహదారి అంచనా వ్యయం సుమారు రూ.5 వేల కోట్లుకాగా, మెగా సంస్థ దీని నిర్మాణ బాధ్యతలు చేపట్టింది. రెండు దశల్లో పూర్తి కానున్న ఈ రోడ్డు నిర్మాణాన్ని 2022 నుంచి మెగా సంస్థ 2022 నుంచి పనుల్లో వేగం పెంచింది. మొదటిదశలో భాగంగా నాయుడుపేట- రేణిగుంట వరకు 57 కిలోమీటర్ల మేర పనులు పూర్తి కానున్నాయి. రెండు లేన్ల రోడ్డుగా ఉన్న ఈ రహదారి 6లేన్ల రోడ్డుగా రూపుదిద్దుకుంటోంది. అయితే రోడ్డు నిర్మాణానికి అవసరమైన మట్టిని మెగా సంస్థ టెండరు ప్రక్రియ ద్వారా సొంతం చేసుకోవాల్సిన అవసరం ఉంది. అయితే ఎక్కడా ఆ సంస్థ ఆ దిశగా చర్యలు చేపట్టిన దాఖలాలు కనిపించడం లేదు. స్థానిక అధికారపార్టీ నేతలు, సంబంధిత అధికారులతో కుమ్మక్కై తమకవసరమైన మట్టిని దోచేస్తున్నారని ప్రజలు బాహాటంగా విమర్శిస్తున్న పరిస్థితి.

లైజనింగ్, హైవే మేనేజర్ల చేతివాటం

జాతీయ రహదారి నిర్మాణంలో నాణ్యత కలిగిన సబ్‌గ్రేడ్ గ్రావెల్‌ను మాత్రమే వాడాలన్న నిబంధన ఉంది. అది అందుబాటులో లేకుంటే రెండో రకం గ్రావెల్‌ను అయినా వాడాల్సి ఉంటుంది. అయితే కొందరు లైజనింగ్, హైవే మేనేజర్లు రోడ్డు నిర్మాణంలో సుద్ద, మట్టి కలిసిన నాణ్యతలేని మట్టిని రోడ్డు నిర్మాణానికి వాడుతున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. రోడ్డు నిర్మాణంలో గ్రావెల్‌కు బదులు మట్టి వాడితే భవిష్యత్తులో కుంగే అవకాశాలున్నాయని నిపుణులు చెబుతున్న మాట. అంతేకాకుండా మెగా ఇంజనీరింగ్ సిబ్బంది రైతుల వద్ద మట్టి తవ్వేందుకు అనుమతులు తీసుకుని వారికివ్వాల్సిన కిరాయి కంటే తక్కువే చెల్లిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. సాధారణంగా ఒక రైతులకు క్యూబెక్ మీటరుకు రూ.70 చెల్లించాల్సి ఉంటే మెగా యాజమాన్యం కనీసం రూ.7కూడా చెల్లించడం లేదని రైతులు వాపోతున్నారు. ఆ కిరాయి కూడా సకాలంలో చెల్లించడం లేదనీ, మధ్యలో దళారులను నియమించుకుని ధగా చేసుస్తున్నారని మండిపుతున్నారు. తిరుపతి జిల్లా నాయుడుపేట నుంచి రేణిగుంట వరకు వందల మంది రైతులకు బకాయి పడ్డారని సమచారం. ఒక వేళ చెల్లించినా అరకొరగానే బిల్లులు చెల్లించి చేతులుకుంటున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక ఎకరంలో మట్టిని/గ్రావెల్‌ను తవ్వితే రైతుకు రూ.2లక్షల వరకు కిరాయి చెల్లించాల్సి ఉంటుంది. అయితే మెగా అధికారులు కేవలం రూ.20 నుంచి రూ.30 వేలే చెల్లిస్తుండటం గమనార్హం. ఇక చెరువులు, ప్రభుత్వ భూముల్లో అధికారపార్టీ నాయకులకు వాటాలిచ్చి నచ్చినంత తవ్వుకుని తరలిస్తున్నారన్న విమర్శలున్నాయి.

రోడ్లు, వీధులు ధ్వంసం

జాతీయ రహదారి నిర్మాణానికి అవసరమైన మట్టిని తవ్వే క్రమంలో మెగా యాజమాన్యం జేసీబీలు, ప్రొక్లేయిన్లు, భారీ టిప్పర్లను వినియోగిస్తుంది. పగలూ రాత్రీ తేడా లేకుండా చెరువులు, ప్రభుత్వ భూములు, రైతుల పొలాలనుంచి మట్టిని తరలించేందుకు ఆయా గ్రామాల రోడ్లను, వీధులను వినియోగిస్తుండటంతో ధ్వంసమయ్యే పరిస్థితి ఏర్పడింది. శ్రీకాళహస్తి మండలం ఉడమల పాడు నుంచి ఊరందూరు రోడ్డులో నిరంతరం టిప్పర్లు మట్టిని తరలిస్తుండటంతో రోడ్డు పూర్తిగా దెబ్బతింది. తొట్టంబేడు మండలం కాసరం పంచాయతీ కొండ్రాజుపల్లి చెరువు నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తుండటంతో రైతులు, గ్రామస్తులు అడ్డుకున్నారు. కల్లిపూడి-శ్రీకాళహస్తి రోడ్డులో నిరంతరం మెగా టిప్పర్లు తిరుగుతుండటంతో రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. మెగా టిప్పరు ఢీ కొన్ని బసవయ్యపాళెం చెక్ పోస్టు వద్ద ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. రైతు పొలాల్లో రెండు మీటర్ల లోతులో మాత్రమే తవ్వకాలు జరగాలన్న నిబంధనను పక్కన పెట్టేశారు. చెరువుల్లో మీటరు మేర లోతులో తవ్వకాలు చేయాల్సి ఉంది. అది కూడా కట్టకు, తూములకు దూరంగా చేపట్టాల్సి ఉంటుంది. ఆ నిబంధనను కూడా మెగా యాజమాన్యం పెడ చెవిన పెడుతోంది. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి జాతీయ రహదారి నిర్మాణంలో మెగా సంస్థ చేస్తున్న మట్టి దోపిడీకి అడ్డుకట్ట వేసి నిబంధనల మేరకు నాణ్యతతోటి రహదారి నిర్మాణం జరిగేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

శ్రీసిటీని సందర్శించిన ట్రైనీ ఐఏఎస్ అధికారులు

ప్రజాశక్తి- వరదయ్యపాళ్యం: భారత్ దర్శన్ స్టడీ టూర్‌లో భాగంగా 2023 బ్యాచ్‌కు చెందిన 19మంది ట్రైనీ ఐఏఎస్ అధికారులు సోమవారం శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ ప్రెసిడెంట్ (ఆపరేషన్స్) సతీష్ కామత్ వీరికి సాదరస్వాగతం పలికారు. ప్రపంచశ్రేణి మౌళిక వసతులు, ప్రత్యేకతలతో పాటు దేశంలోని భారీ పారిశ్రామిక పార్కులలో ఒకటిగా శ్రీసిటీ ఎలా ఉద్భవించింది, మేక్-ఇన్-ఇండియా నినాదం మేరకు అత్యంత వేగంగా ఉద్యోగాల కల్పన, ఈ ప్రాంత ఆర్థిక వ్యవస్థకు ఎలా ఊతమందించి అన్న అంశాలను వారికి వివరించారు. శ్రీసిటీ మౌళిక సదుపాయాలు, వ్యాపార అనుకూల వాతావరణం అద్భుతం అంటూ ట్రైనీ ఐఏఎస్‌ల బందం లీడర్ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఇతరులు అనుసరించాల్సిన ఒక మోడల్‌గా దీనిని అభివర్ణించారు. శ్రీసిటీ వాతావరణం, పారిశ్రామిక మౌళిక సదుపాయాలు ఇక్కడ 'సులభతర వ్యాపారం', 'సులభతర జీవన సౌలభ్యాన్ని' నిర్ధారిస్తున్నాయన్నారు. ట్రైనీ ఐఏఎస్ అధికారుల పర్యటన పట్ల తన సందేశంలో సంతోషం వ్యక్తం చేసిన శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, ట్రైనీ ఐఏఎస్‌లే కాకుండా దేశ విదేశాలకు చెందిన అధికారులు, వ్యూహకర్తలు, నిర్వాహకులు, సాంకేతిక నిపుణులు తమ అధ్యయనానికి శ్రీసిటీని ఎంచుకోవడం తమకు గర్వకారణమన్నారు. తమ అనుభవాలను వారితో పంచుకోవడం ఆనందంగా ఉందన్నారు. పర్యటనలో భాగంగా ట్రైనీ ఐఏఎస్‌లు శ్రీసిటీ పరిసరాలు సందర్శించారు. శ్రీసిటీ అధికారులతో చర్చల సందర్భంగా పారిశ్రామికవాడకు సంబంధించిన వివిధ అంశాలపై ఆరా తీశారు.

టీటీడీ అటవీ కార్మికుల

నిరవధిక దీక్షలకు ఆటంకాలు కల్పించవద్దు

ఎస్పీకి సిఐటియు విజ్ఞప్తి



ప్రజాశక్తి- తిరుపతి టౌన్: మూడు సంవత్సరాల రెండు నెలలుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్నా టిటిడి అటవీ కార్మికుల సమస్యలు పరిష్కారం కాలేదని, అనివార్యమైన స్థితిలో ఈనెల 27వ తేదీనుంచి నిరవధిక నిరాహార దీక్షలకు పూనుకుంటున్నామని ఆటంకాలు కల్పించవద్దని జిల్లా ఎస్పీ పరమేశ్వర్ రెడ్డికి కార్మికులు, సిఐటియు, రిపబ్లికన్ పార్టీ నేతలు విజ్ఞప్తి చేశారు. సోమవారం జిల్లా ఎస్పీ క్యాంపు కార్యాలయంలో సిఐటియు ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, రిపబ్లికన్ పార్టీ నేత పూతలపట్టు అంజయ్య, అటవీ కార్మిక సంఘం నేతలు ఈశ్వర్ రెడ్డి, సురేష్, సురేంద్ర, కష్ణమూర్తిలు ఎస్పీ పరమేశ్వర్ రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు ఆరుగురు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-యర్రావారిపాలెం: మండలంలోని ఆదర్శ పాఠశాల నుండి నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షలో ఎనిమిదవ తరగతికి చెందిన ఆరుగురు విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ బిటి శ్రీదేవి సోమవారం తెలిపారు. ఎనిమిదవ తరగతి విద్యార్థులు నేహశ్రీ, దీక్షిత మహాలక్ష్మి, సిద్ధిలాస్, అనూష, మిథున్, రెడ్డి ఉమేష్ ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో సహా ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. విద్యార్థులు మరెన్నో విజయాలు సాధించాలని తెలిపారు.

యోగా గురువు పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): యోగా గురువు పోస్టులకు ఆసక్తి కలిగి అనుభవం కలిగిన స్త్రీ, పురుష అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు మంగళం (ప్రాజెక్ట్ ఆయుష్ హోమియో) ప్రభుత్వ వైద్యాధికారి ఎంఎస్ ప్రసన్న లక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల రోజులలో పురుషులు 32గంటలు, స్త్రీలు 20 గంటలు పని రోజులుగా నిర్ణయించామని, పురుషులకు రూ.8 వేలు, స్త్రీలకు రూ.5 వేల రూపాయలు వేతనం చెల్లిస్తామన్నారు. ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు 9908366751 నెంబరును సంప్రదించాలన్నారు.

టిడిపి అభ్యర్థి ఎవరో తేల్చుకోండి?: నేదురుమల్లి

ప్రజాశక్తి-వెంకటగిరి: టిడిపి అభ్యర్థి ఎవరో తేల్చుకోవాలని వైసిపి సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి టిడిపి నాయకులు సవాలు విసిరారు. తాను మాఫీ చేస్తున్నానని చంద్రబాబు వద్ద చెప్పించారని టిడిపి నాయకులకే తెలియదా ఆధారాలతో నిరూపిస్తానని పేర్కొన్నారు. బిసి సాధికార సభకు వచ్చిన జనం చంద్రబాబు సభకు రాలేదన్నారు. 7500 కుర్చీలు వేశారని అవి కూడా ఖాళీగా దర్శనమిచ్చాయన్నారు. ఆనంకు ఈప్రాంత ప్రజలు ఐదేళ్లు ఎమ్మెల్యే అవకాశం ఇస్తే అభివృద్ధి చేయకుండా వాటి అడ్డుకున్న ఎమ్మెల్యేగా ఈప్రాంత ప్రజలందరికీ ఆయన వ్యవహారం తెలుసునన్నారు. రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి అధికారంలోకి వస్తుందని పేర్కొన్నారు. ఆయన వెంట ఆ పార్టీ నాయకులు ఎల్ కోటేశ్వరరావు, ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సచివాలయ భవనం ప్రారంభం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి రూరల్ మండలం బ్రాహ్మణపట్టు గ్రామ పంచాయతీ పరిధిలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనం, ఆర్బికే, వైయస్సార్ హెల్త్ క్లినిక్, మహిళా స్వయం సహాయక సంఘ భవనాలను వైసిపి చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి సోమవారం ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. దాదాపు కోటి రూపాయల నిధులతో ఒకే ప్రాంగణంలో ప్రజలకు ప్రభుత్వ సేవలను అందించాలని లక్ష్యంతో నూతన భవనాలను నిర్మించారని, ప్రభుత్వ సంక్షేమ, పౌర సేవలను ప్రజల చెంతకు తీసుకువచ్చిన ఘనత సీఎం జగన్మోహన్ రెడ్డికి దక్కుతుందని చెవిరెడ్డి మోహిత్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ పట్టు ఎంపిటిసి బి.యోగానంద రెడ్డి, వార్డు మెంబర్లు, వైసిపి నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పకడ్బందీగా 'కుల గణన' సర్వే: తహశీల్దారు

ప్రజాశక్తి -కేవిబిపురం: కేవిబిపురం మండలంలోని గ్రామాలలో కుల గణన సర్వేను పకడ్బందీగా చేయాలని తహశీల్దారు శ్రీదేవి తెలిపారు. మండలంలోని 39 గ్రామ పంచాయతీలలో గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామ కార్యదర్శులు, వీఆర్‌ఓ లు కుల గణన పై సర్వే చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుల గణన సర్వేను సచివాలయాల సిబ్బంది వాలంటీర్లతో పక్కాగా సర్వే నిర్వహించాలన్నారు. సర్వే పూర్తయిన తర్వాత ఈ కేవైసీ బయోమెట్రిక్ తప్పనిసరిగా చేయాలన్నారు. పది రోజుల లోపు సర్వేను పూర్తి చేయాలని తెలిపారు . ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామచంద్రయ్య పాల్గొన్నారు.

అన్నయ్యను గెలిపించండి..

చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి అభ్యర్థన

ప్రజాశక్తి - క్యాంపస్ : 'జగనన్న సంక్షేమ పాలన.. ఎమ్మెల్యే చెవిరెడ్డి ముందుచూపుతో చేసిన అభివృద్ధి పనులతో చంద్రగిరి నియోజకవర్గ రూపురేఖలు మారాయని.. చంద్రగిరి చరిత్రలో జగనన్న పాలన చిరస్మరణీయంగా నిలుస్తుంది..' అని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తనయుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం చంద్రగిరి పంచాయతీ పరిధిలోని ఇందిరమ్ కాలనీ, బజారు వీధిలలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందు రామ మందిరంలో ప్రత్యేక పూజలు చేసిన చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి ఆ తర్వాత గడప గడపకు వెళ్లి సంక్షేమ పథకాల జాబితాలను అందించారు. చెవిరెడ్డి చేసిన మేలుకు రుణం తీర్చుకోవాలంటే ఆయన బిడ్డను ఎమ్మెల్యేగా చేయడం ఒక్కటే తమకున్న అవకాశం అంటూ పలువురు మహిళలు బహిరంగంగా స్పష్టం చేశారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్: మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దాతృత్వంతో గూడూరు పట్టణంలోని సంఘం థియేటర్ కూడలి వద్ద హీరాబెన్ మాతాజీ గ్లోబ్ ల్ ట్రస్ట్ అధ్యక్షుడు కంకణాల పెంచల నాయుడు చేతుల మీదుగా పేదలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పేదలకు సేవ చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

తిరుపతి(మంగళం): తిరుచానూరు పరిధిలో సర్పంచి కీరకట్టు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం వెయ్యి మందికి అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మునీంద్ర రాయల్, చంద్రశేఖర్, యోగానంద, మురళి, ఎంపిటీసీలు కె నరేష్ రెడ్డి, శేఖర్, పెద్ద సంఖ్యలో వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

తిరుపతి సిటీ: కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పిసి రాయులు ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ డైరెక్టర్ రుద్రరాజు శ్రీదేవి, బండి మధుసూదన్ రెడ్డి, ఉదయగిరి కృష్ణమూర్తి, సుబ్రమణ్యం రెడ్డి, ఉమాపతి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ ఎంపిక

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలోని స్థానిక. ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ స్థాపించి ఇప్పటికీ 15 సంవత్సరాలు అయింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ ఫౌండర్‌గా కోనేటి రవిరాజు నియమిస్తూ, అసోసియేషన్ ప్రసిడెంట్ బొడ్డులూరు బాబు ని, జనరల్ సెక్రెటరీగా అస్థి రామ్మోహన్ వర్మని , ఇ లోకనాథ నాయుడు ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ తరపున నడక గురించి అవగాహన మెడికల్ క్యాంప్స్ ,పేద విద్యార్థులకు బుక్స్ ఆట వస్తువులు ఉచిత పంపిణీ, చలివేంద్రాలు, పేదలకు దుస్తులు ఎన్నో కార్యక్రమాలు చేశారు. ఈ నెల 25వ తేదీ ఆర్టీసీ బస్టాండ్‌లో ఉచితంగా మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నారని, తిరుపతి నుండి ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్, వాసన్ ఐ కేర్ హాస్పిటల్,హీరింగు ,డెంటల్, ఉచితంగా పరీక్షలు చేసి మందులు ఇస్తారని తెలిపారు. ఈ సందర్భంగా బ్లడ్ క్యాంపు నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాబునాయుడు, మురళి , లోకనాథ నాయుడు, ప్రసాద్‌రావు, కుప్పయ్య ,విజయ్ కుమార్, వాకర్స్ సభ్యులు పాల్గొన్నారు.

'ఎంఎస్ డేటా సైన్స్'తో బంగారు భవిష్యత్తు : విసి

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో విదేశాల్లో అందుబాటులో ఉన్న ఎంఎస్ డేటా సైన్స్ కోర్స్ ను ఉపకులపతి ఆచార్య శ్రీకాంత్ రెడ్డి సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ కోర్సుకు బంగారు భవిష్యత్తు వుంటుందని విసి పేర్కొన్నారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి రూపకల్పన చేసిన రకరకాల సాంకేతిక పరిజ్ఞానం గల కోర్సుల్లో భాగంగా ఎంఎస్ డేటా సైన్స్ కోర్సును నిర్వహించేందుకు అమెరికాలోని 'ఎక్సా ఫ్లూయెన్స్ ఇన్స్' సంస్థతో ఎస్వీయూ ఎమ్ఓయు చేసుకుంది. దీనిని అంతర్జాతీయ స్థాయి సిలబస్ తో , విదేశీ ఆచార్యులత బోధనలతో, విదేశీ కంపెనీలతో సర్టిఫికేషన్ చేయించే దిశగా కోర్సును ఉన్నత విద్యామండలి రూపకల్పన చేసింది.

అంగన్‌వాడీలకు మద్దతు

- 24న రాష్ట్ర బంద్‌ను జయప్రదం చేయండి..
- సిఐటియు, ఏఐటియుసీ, ఐఎఫ్‌టియు నాయకుల పిలుపు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: అంగన్‌వాడీలకు సమ్మెకు మద్దతుగా, వారిపై ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఈ నెల 24వ తేదీ చేపట్టనున్న బంద్‌ను జయప్రదం చేయాలని కోరుతూ సిఐటియు, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టియు నాయకులు పిలుపు నిచ్చారు. ఒక లక్షా ఐదువేల మంది అంగన్‌వాడీ సిబ్బందికి జీతభత్యాలు, పని భారాలు తదితర సమస్యలపై సిఐటియు, ఏఐటియుసి , ఐఎఫ్టియు అనుబంధ అంగన్‌వాడీ సంఘాల ఆధ్వర్యంలో గత 42 రోజులుగా సమ్మె సాగుతోంది. వారి డిమాండ్లకు మద్దతుగా ప్రజలనుండి సేకరించిన కోటి సంతకాలను జగనన్నకి సమర్పించడానికి విజయవాడ వెళుతున్న అంగన్వాడీలపై పాశవికంగా పోలీసులతో దాడి చేయించారు. అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడానికి బదులు రాష్ట్ర ప్రభుత్వం ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం అత్యంత నిరంకుశమన్నారు. సైగా నిరవధిక నిరాహార దీక్షలు చేస్తున్న దీక్షా శిబిరంపై సోమవారం42వరోజు తెల్లవారుజామున 3 గంటలకు నిరాహారదీక్ష శిబిరాన్ని కూల్చివేశారు. దీక్షలు చేస్తున్న వారిని నిరంకుశంగా దౌర్జన్యంగా తరలించి నిర్బంధించారు. వారి ఆరోగ్యాన్ని కూడా పట్టించుకోలేదు. కొంతయు తీసివేసి మహిళలను మగ పోలీసులు అరెస్టులు చేసి అర్ధగంట పాటు యుద్ధభూమిని తలపించారు. దీక్షలకు మద్దతుగా పాల్గొన్న సుమారు 2 వేల మందిని అరెస్టుచేసి మచిలీపట్నం, నూజివీడు తదితర సుదూర ప్రాంతాలకు తరలించారు. లక్ష మందికి పైగా అంగన్‌వాడీలు చాలిచాలని జీతాలతో జీవిస్తున్న కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వ పాశవిక విధానానికి వ్యతిరేకంగా, బాధిత అంగన్వాడిలకు సంఘీభావంగా రాష్ట్ర బంద్ చేయడం అవసరమని రాష్ట్ర అఖిల పక్ష ట్రేడ్ యూనియన్లు భావించాయి.

విజయవాడలో అంగన్‌వాడీలను నిర్బంధించిన పోలీసులు

ఈ నేపథ్యంలో 24వ తేదీ చేపట్టనున్న రాష్ట్ర బంద్‌ను జయప్రదం చేసి నిరంకుశ రాష్ట్ర ప్రభుత్వం పట్ల తగిన ప్రతిఘటనను చూపాలని రాష్ట్ర రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, హక్కుల సంఘాలు, ప్రజాస్వామిక వాదులు, వివిధ వర్గాల ప్రజలు బలపరచాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ, ఐఎఫ్టియు రాష్ట్ర కార్యదర్శి ఆర్ హరికృష్ణ, టిఎన్‌టియ సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంబూరి సింధూజ, ఐఎన్‌టి యుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు లేబూరి రత్నకుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

దొంగ ఓట్లు నమోదుపై ఎస్‌పికి ఫిర్యాదు

ఎస్‌పికి ఫిర్యాదు చేస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి - క్యాంపస్ : చంద్రగిరి నియోజక వర్గాన్ని దొంగ ఓట్లు నమోదుకు కేరాఫ్ అడ్రస్ గా మార్చారని ఎమ్మెల్యే చెవిరెడ్డి పై చిత్తూరు జిల్లా టిడిపి పార్లమెంటు అధ్యక్షుడు, టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని ధ్వజమెత్తారు. ఆదివారం దొంగ ఓట్లు నమోదుకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని తిరుపతి ఎస్పీ, రామచంద్రాపురం, ఎస్.వి యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ లో పోలీసులకు ఆయన ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో కానీ రాష్ట్రంలో కానీ దొంగ ఓట్లు నమోదులో చంద్రగిరి నియోజకవర్గం ముందుందని పేర్కొన్నారు. మొన్న పార్లమెంటు ఎన్నికల్లో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఏ విధంగా దొంగ ఓట్లు నమోదు చేయించారో అధికారుల సస్పెండ్ తో రుజువైందని తెలిపారు. 2019 ఎన్నికల్లో దొంగ ఓట్లుతో ఎమ్మెల్యే అయిన చెవిరెడ్డి మళ్లీ అదేవిధంగా 6 మండలాల ఎమ్మార్వోలు, ఆర్డీవో లాగిన్ లు, ఏఈఆర్ ఓ, విఆర్ ఓ లాగిన్ లతో ప్రైవేట్ వ్యక్తులను పెట్టి దొంగ ఓట్లు నమోదు చేయించారని ఆరోపించారు. దీనిపై సెంట్రల్ , స్టేట్ ఎలక్షన్ కమిషన్, కలెక్టర్, సైబర్ క్రైమ్ కు ఫిర్యాదు చేశామన్నారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'మికింస్టాన్ సెలూన్' ప్రారంభం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: తిరుపతిలో నూతనంగా ఏర్పాటు చేసిన మికింస్టాన్ సెలూన్ ను నగర మేయర్ డాక్టర్ శిరీష ప్రారంభించారు. స్థానిక భవానీనగర్ సర్కిల్ సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయం ప్రక్కన సిటి కాంప్లెక్సులో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం ఆమె మాట్లాడుతూ తిరుపతిలో పురుషులు కోసం ప్రత్యేకంగా మిక్కీం స్టాన్ సెలూన్ ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. మగవారి అందాన్ని, ఆరోగ్యాన్ని మరింత మెరుగుపరిచేందుకు ఇది దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. సెలూన్ నిర్వహకులు హరి, అజయ్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా మికింస్టాన్ సంస్థ 47 బ్రాంచ్ లతో నడుస్తుందన్నారు. తెలంగాణ ఆంధ్రప్రదేశ్ రెండు తెలుగు రాష్ట్రాల్లో మొట్టమొదటిసారిగా తిరుపతి నందు ఈ బ్రాంచ్ ను ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. ఇందులో అతి తక్కువ ధరలకు సర్వీస్ అందిస్తున్నామన్నారు. రూ.125 కే కటింగ్, రూ 50కే సేవింగ్, మరింత తక్కువ ధరలకే అందాన్ని మెరుగుపరిచే బ్యూటిషన్ సేవలు అందిస్తున్నామన్నారు. ఆకర్షణీయమైన ఫర్నిచర్, అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన ప్రొడక్ట్స్‌తో మగవారు నచ్చిన విధంగా, అనుభవజ్ఞులైన సిబ్బందిచే సర్వీసులు అందిస్తు న్నామన్నారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఆ సంస్థ ఫౌండర్ దేరణ్ మాట్లాడుతూ మికింస్టాన్ సెలూన్లు ఇప్పటికే దేశవ్యాప్తంగా మహానగరాల్లో ఏర్పాటు చేశామన్నారు. తెలుగు రాష్ట్రాల్లో మొదట తిరుపతిలో ఏర్పాటు చేయడం సంతోషకర మన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన సర్వీసులు తిరుపతి వాసులకు అందించాలని ఉద్దేశంతో ఇక్కడ దీన్ని ఏర్పాటు చేశామని తెలిపారు.

సెవెన్ హిల్స్ ఫార్మసీ అవగాహన ఒప్పందం

అవగాహన ఒప్పందం చేసుకుంటున్న సెవెన్‌హిల్స్ ఫార్మసీ యాజమాన్యం

ప్రజాశక్తి -రామచంద్రాపురం: యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికాకు చెందిన బోగార్ లేబొరేటరీస్‌తో సెవెన్ హిల్స్ ఫార్మసీ కళాశాల అవగాహన ఒప్పందం ఏర్పాటు చేసుకున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం నిరంజన్ బాబు తెలిపారు. సోమవారం మండలంలోని వెంకట్రామపురంలోని సెవెన్ హిల్స్ ఫార్మసీ కళాశాలలో అవగాహన ఒప్పంద నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ వెంకట్రావు, గౌరవ ముఖ్య అతిథిగా యూఎస్ఏ బోగార్ లేబొరేటరీస్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రమేష్ బాబు బోగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమేష్ బాబు బోగా మాట్లాడుతూ ఫార్మసీ విద్యార్థులకు ప్రత్యేకమైన శిక్షణ, అధ్యా పక బృందానికి ప్రత్యేకమైన నైపుణ్యత, సాంకేతిక, పరిశోధ నాత్మకమైన అంశాలపై ఒప్పందం చేసు కున్నా మన్నారు. రిటైర్డ్ ప్రొఫెసర్ వెంకట్రావు మాట్లా డుతూ ఆధునిక పోటీ ప్రపంచంలో విద్యార్థులు నూతన ఔషధాలు తయారీపై ఆవిష్క రణలు చేయాలని పిలుపునిచ్చారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం నిరంజన్ బాబు మాట్లాడుతూ కళాశాల చరిత్రలో ఈ అవగాహన నూతన ఒప్పందం మైలురాయి వంటిదని పేర్కొన్నారు. అనంతరం కళాశాల యాజమాన్యం తరపున అతిథులకు దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించి, వెంకటేశ్వర స్వామి చిత్రపటాన్ని జ్ఞాపకాలుగా అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ సుమలత, కళాశాల అకాడమిక్ డైరెక్టర్ శరవణ బాబు, బోధన బోధనేతర సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధిగ్రస్తుల గుర్తింపునకు సర్వే

ప్రజాశక్తి -దొరవారిసత్రం: కిడ్నీ సంబంధించిన వ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తించేందుకు ఆరోగ్య సిబ్బంది పాలెంపాడులో సోమవారం సర్వే నిర్వహించారు. ఆ గ్రామంలో పలువురు నీటి ద్వారా కిడ్నీ వ్యాధిగ్రస్తులుగా మారుతున్నారని ఆందోళన చెందుతూ ఆ గ్రామస్తులు వైద్య అధికారులకు సమాచారం అందించారు. ఈ విషయంపై స్పందించిన దొరవారిసత్రం పిహెచ్‌సి వైద్య అధికారి చైతన్య తన సిబ్బందితో సోమవారం మెడికల్ క్యాంపును ఏర్పాటు చేశారు. సిబ్బందిని రెండు గ్రూపులుగా విభజించి ప్రతి ఇంటిలో ఉన్న సభ్యులందరిని ఆరోగ్య స్థితిగతులపై ఆరా తీశారు. గ్రామం మొత్తంలో 25 మంది కిడ్నీ సంబంధించిన వ్యాధిగ్రస్తులు పలు ఆసుపత్రుల ద్వారా చికిత్స పొందుతున్నట్లు గుర్తించారు. వారికి విలువైన ఆరోగ్య సలహాలను ఆహారపు అలవాట్ల గురించి తెలిపారు. గ్రామంలో తాగునీటి వనరులను బ్యాక్టీరియా పరీక్షలు నిర్వహించారు. అను మానం ఉన్న ఒక్క చేతి బోరు నీటిని సేకరించి వాటర్ ల్యాబ్ టెస్ట్ కు పంపించా మన్నారు. ఈ సర్వేలో పలువురు అత్యధికంగా పెయిన్ కిల్లర్స్ మాత్రలు వాడడంతో కిడ్నీ వ్యాధికి గురైనట్లు వెల్లడించారు. గ్రామం మొత్తంలో ఆరోగ్య సర్వే చేపట్టి హెల్త్ ప్రొఫైల్ తయారు చేశారు. అనుమానం ఉన్న ఎవరైనా ప్రాథమిక కేంద్రానికి వచ్చి కిడ్నీల పనితీరును లేబరేటరీలు పరీక్షించుకోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో డాక్టర్ చంద్రకళ, సిహెచ్‌ఓ సంపూర్ణమ్మ పీహెచ్ఎన్ పద్మావతి, హెల్త్ సూపర్వైజర్స్ గోవి, కిరణ్, మైథి, ఎంఎల్ హెచ్ పి మౌనిక ఏ ఎన్ ఎం వజ్రమ్మ ఆశ వాలంటీర్ వీరమ్మ అన్నపూర్ణమ్మ ప్రభలకుమారి సుగుణ పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధి గ్రస్తుల గుర్తింపు సర్వే నిర్వహిస్తున్న దృశ్యం

శ్మశాన వాటిక అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలోని స్థానిక పురపాలక సంఘంలో శ్మశాన వాటిక నిర్మాణ అభివృద్ధి పనులను కమిషనర్ కేఎల్ఎంఎన్ రెడ్డి సోమవారం పరిరక్షించారు. నగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే మంత్రి ఆర్‌కె రోజా ఆదేశాల మేరకు పట్టణ పరిధిలోని శ్మశాన వాటిక అభివృద్ధి పనులను ఒకటవ వార్డు పరిధిలోని కేకేఆర్ పురం (పల్లూరు), 5వ వార్డు పిళ్లారి పట్టు వార్డులలో రూ.70 లక్షల రూపాయల అంచనా మొత్తంతో జరుగుతున్న జిజిఎంపి పనులను పరిశీలించారు. నూతన పురపాలక సంఘం కార్యాలయంలో అభివృద్ధి పనులను పరిశీలించి త్వరిత గతిన పూర్తి చేయాలని గుత్తేదారుని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.


అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కమిషనర్ కెఎల్‌ఎంఎన్‌రెడ్డి

ఎస్‌విపురం రోడ్డు గుంతలమయం

- ప్రమాదానికి నిలయం
- భయాందోళనలో ప్రయాణికులు

ప్రమాదకరంగా మారిన రోడ్డు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: వడమాల పేట మండలంలో జాతీయ రహదారి ఎస్‌విపురం బ్రిడ్జి వద్ద రోడ్డు మరమ్మతుకు గురై వాహనాలు రాకపోకలకు ఇబ్బందికరంగా ఏర్పడింది. వాహనం నుండి కిందపడి ప్రమాదాలకు గురై హాస్పిటల్ పాలవు తున్నారు. పలుసార్లు చిన్నపాటి వర్షానికి కూడా వర్షపు నీరు నిండిపోవడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. దీనిపై పలుసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఏమాత్రం పట్టించుకోవడం లేదని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేసి వాహన చోదకులకు న్యాయం చే యాలని కోరుతున్నారు. లేని పక్షంలో వాహనదారులు ఎస్‌వి పురం గ్రామ ప్రజలు కలిసి సంబంధిత కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

వడ్డెర్లకు బడ్జెట్లో రూ.1500 కోట్లు నిధులివ్వాలి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): పట్టణంలోని బిటిఆర్ కాలనీ అన్నమయ్య కళాక్షేత్రంలో జానపద కళాకారుల రాష్ట్ర కార్యాయలంలో సోమవారం ఆంధ్రప్రదేశ్ వడ్డెర వత్తిదారుల సంఘం తిరుపతి జిల్లా సదస్సు చల్లా చిన్న వెంకటయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సదస్సుకు ఆంధ్రప్రదేశ్ వడ్డెర వత్తిదారుల సంఘం రాష్ట్ర కన్వీనర్ గుంజి దయాకర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. వడ్డర్లకు బడ్జెట్లో రూ.1500కోట్లు నిధులు కేటాయించి ఆ నిధులను వడ్డెర్ల సంక్షేమంకు ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. క్వారీలపై గుట్టలపై పూర్తిహక్కు వడ్డెర వత్తిదారులకి ఇవ్వాలని, ప్రతి వడ్డెర కుటుంబానికి మూడు ఎకరాలు సాగు భూమి నివ్వాలని, ఇల్లు లేని వారికి ఇళ్ల స్థలాలు కేటాయించి వెంటనే పక్కా ఇల్లు కట్టించాలని, కేజీ నుంచి పీజీ వరకు ఉచితంగా మెరుగైన విద్యను అందించాలని, హెల్త్‌కార్డు ద్వారా ఉచితంగా మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు.న్యాయవాది చల్లా వెంకటయ్య పాల్గొని మాట్లాడుతూ వడ్డెరలందరూ ఐక్యంగా తమ సమస్యలపై ఉద్యమించి పరిష్కారదిశగా పోరాడి సాధించుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం తిరుపతి జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులుగా చల్లా చిన్న వెంకటయ్య, కార్యదర్శిగా పసుపులేటి బాబు, ట్రెజరర్‌గా వల్లి పి.సాయికిరణ్, గౌరవ అధ్యక్షులుగా మల్లెల వెంకటముని, లీగల్ అడ్వైజర్‌గా చల్లా వెంకటయ్య , ఉపాధ్యక్షులుగా ఉప్పు హరి, జె.మోహన్, జె.ఏడుకొండలు, పెరుమాల్, సిహెచ్ రామచంద్ర, సహాయ కార్యదర్శులుగా వై.ఆంజనేయులు, జె.బాబు, చంద్రగిరి శివ, డి.కుప్పయ్య, సిహెచ్.నాగరాజు కమిటీ సభ్యులుగా ఎం.నాగయ్య, పి.సుబ్రహ్మణ్యం, ఆర్.జయరామ్, వి.శంకరన్, కె.గంగాధరం, పి.రాజా, ఎం.పలానవేల్, డి.వెంకట రమణ, ఎస్.రవి, బి.శివయ్య, పి.గణేష్, డి.పెద్దరెడ్డప్ప ఎన్నికయ్యారు.

మాట్లాడుతున్న వడ్డెర్ల సంఘం నాయకులు

అన్ని విభాగాలు సమన్వయంతో వ్యవహరించాలి: టిటిడి జేఈవో

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: తిరుమల ఆస్థాన మండపంలో ఫిబ్రవరి 3 నుండి 5వ తేదీ వరకు టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ధార్మిక సదస్సుకు ఏర్పాట్లు వేగంగా పూర్తి చేయాలని టీటీడీ జేఈవో సదా భార్గవి అధికారులను ఆదేశించారు. తిరుపతి శ్రీ పద్మావతి విశ్రాంతి భవనంలో సోమవారం జేఈవో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జేఈవో మాట్లాడుతూ తిరుమల ఆస్థాన మండపంలో నిర్వహించనున్న ధార్మిక సదస్సుకు దేశంలోని ప్రముఖ మఠాధిపతులు, పీఠాధిపతులను ఆహ్వానించేందుకు ఆహ్వాన పత్రికలు, ధార్మిక కార్యక్రమాలపై బుక్ లెట్ రూపొందించాలని డిపిపి అధికారులను ఆదేశించారు. సదస్సుకు విచ్చేసే వారికి ఎలాంటి అసౌకర్యం లేకుండా దర్శనం, వసతి, రవాణా సదుపాయాలను సమన్వయం చేసుకోవడానికి ప్రత్యేకంగా సిబ్బందిని ఏర్పాటు చేయాలన్నారు. టీటీడీ నిర్వహించే ధర్మ ప్రచార కార్యక్రమాలపై వీడియో రూపొందించాలని ఎస్వీబీసి సిఈవోను ఆదేశించారు. సనాతన ధార్మిక సదస్సును ఘనంగా నిర్వహించేందుకు లైజన్, నోడల్ అధికారులను నియమించాలన్నారు. అనంతరం సదస్సు నిర్వహణకు సంబంధించి చేయవలసిన ఏర్పాట్లను విభాగాల వారిగా జేఈవో సమీక్షించారు. ఈ సమావేశంలో వేద విశ్వ విద్యాలయం విసి ఆచార్య రాణి సదాశివమూర్తి, ఎస్వీబీసి సిఈఓ షణ్ముఖ కుమార్, డిపిపి కార్యదర్శి సోమయాజులు, ప్రోగ్రాం అధికారి రాజగోపాల్, దాస సాహిత్య ప్రాజెక్టు ప్రత్యేక అధికారి పిఆర్ ఆనందతీర్థాచార్యులు, కళ్యాణం ప్రాజెక్టు అధికారి చంద్రశేఖర్ రెడ్డి, డెప్యూటీ ఈవో గోవిందరాజన్, జియం (ఐటి సందీప్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంను తనిఖీ చేస్తున్న ఎంఇవో 2 కృష్ణయ్య

మెనూ అమలు చేయకుంటే చర్యలు

మధ్యాహ్న భోజనం తనిఖీలో ఎంఇవో

ప్రజాశక్తి -దొరవారిసత్రం: ప్రభుత్వం అమలు చేస్తున్న మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించకుంటే చర్యలు తప్పవని ఎంఇవో 2 హెచ్చరించారు. మండల పరిధిలోని టపా ఇండ్లలోని ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ- 2 సిహెచ్ కృష్ణయ్య సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలకు సంక్రాంతి సెలవులు ఇచ్చిన తర్వాత పాఠశాలలో మొదటి రోజు ప్రారంభం కావడంతో పాఠశాలను పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. పిల్లల విద్యా విధానం గురించి విద్యార్థులను అడిగి తెలుసు కున్నారు. అనంతరం మధ్యాహ్నం పూట అమలు చేస్తున్న జగనన్న గోరుముద్దను పరిశీలించి విద్యార్థులతో భోజనం రుచి చూశారు. మెనూ ప్రకారం భోజనంను అమలు చేయకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. వీరితో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పాల్గొన్నారు.

యశోద భాయికి ఉద్యోగోన్నతి

విధులు చేపట్టిన యశోదభాయి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): అటవీ శాఖ బయోట్రీమ్‌లో స్టేట్ సిల్వికల్చరిస్ట్‌గా విధులు నిర్వహిస్తున్న ఐఎఫ్ఎస్ అధికారి యశోద భాయికి ఉద్యోగోన్నతి లభించింది. కంజర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ గా జనవరి ఒకటో తేదీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిం ది. సోమవారం ఈ మేరకు యశోద భాయి చార్జ్ తీసు కున్నారు.

దళితునిపై దాడి..ఆస్పత్రి పాలు

ప్రజాశక్తి - బాలాయపల్లి : వ్యవసాయ కూలి పనులకు వెళ్లిన దళితుడు దార వెంకటయ్యపై దాడి చేయడంతో ఆసుపత్రి పాలైన సంఘటన మండలంలోని వాక్యం గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. బాధితుడి కథనం మేరకు... అదే గ్రామానికి చెందిన కోలా నరేష్ అనే రైతుకు నిమ్మ చెట్లు తవ్వేందుకు ఉదయం ఆరుగురు కూలీలు వెళ్లారు. ఆయన వ్యవసాయ పొలంలో పనిచేస్తున్న సమయంలో అదే గ్రామానికి చెందిన కొమ్మి నాగయ్య నాయుడు, కొమ్మి శ్రీనివాసులు నాయుడులు కులం పేరుతో పరుష పదజాలం వాడుతూ దాడి చేయడంతో స్పృహ తప్పి పడి పోయాడు. దీంతో ఆయనతో కూలి పనులకు వెళ్లిన తోటి కూలీలు వైద్యం నిమిత్తం గూడూరు ఆసుపత్రికి తరలించారు.

కష్టాలు తొలగాలంటే చంద్రబాబు రావాలి: టిడిపి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ఆంధ్రప్రదేశ్ ప్రజల కష్టాలు తొలగాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని, నగరి నియోజకవర్గ ప్రజల కష్టాలు తీరాలంటే భానుప్రకాష్ ఎమ్మెల్యేగా గెలవాలని పుత్తూరు పట్టణ టీడీపీ అధ్యక్షుడు జి జీవరత్నం నాయుడు, ప్రధాన కార్యదర్శులు ఎన్ఎన్ ధనపాల్ పేర్కొన్నారు. 'బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ'లో భాగంగా యూనిట్ ఇన్‌ఛార్జ్ ఎల్లంటి ప్రసాద్ నాయుడు ఆధ్వర్యంలో పుత్తూరు మున్సిపాలిటీ 66వ బూత్ ఎన్జీవో కాలనీలో రిజిస్ట్రేషన్లు చేయించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో బూత్ ఇన్‌ఛార్జి టి మునస్వామి యాదవ్, బివి రమణ, వెంకటాద్రి, గోవర్ధన్, శారదమ్మ, షర్మిల, ధనలక్ష్మి, సుబ్బరత్నమ్మ, మహేష్, అశోక్ పాల్గొన్నారు.

క్రైం న్యూస్

ట్రాక్టర్ బోల్తా

వ్యక్తి మృతి

ప్రజాశక్తి -బుచ్చినాయుడు కండ్రిగ: ట్రాక్టరు బోల్తా పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో సోమవారం చోటు చేసుకుంది. మండలంలోని వేణుగోపాలపురానికి చెందిన గుర్రప్ప నాయుడు వద్ద పాలేరు వెంకటయ్య ట్రాక్టరు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం ఉదయం పంట పొలాల నిమిత్తం కుమార వెంకటాపురం గ్రామానికి చెందిన పాలేరు కృష్ణయ్య కుమారుడు పాలేరు వెంకటయ్య (40) తెలుగు గంగ కాలువ నుండి పంట పొలాల్లో పని నిమిత్తం రాయిని ట్రాక్టర్లో తీసుకు వెళుతుండగా పంట పొలంలో గట్లు తగలడంతో ట్రాక్టర్ బోల్తా పడింది. వెంకటయ్య ట్రాక్టర్ టైర్ల కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న సబ్ ఇన్స్పెక్టరు వెంకట నరసింహం తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని విషయాలు సేకరించి చనిపోయిన వెంకటయ్యను పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా హాస్పిటల్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై వెంకట నరసింహం, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

భాకరాపేట ఘాట్‌లో ప్రైవేటు బస్సు బోల్తా

పలువురికి గాయాలు

ప్రజాశక్తి -రామచంద్రాపురం (చంద్రగిరి): తిరుపతి –మదనపల్లి జాతీయ రహదారిలో చంద్రగిరి మండలం భాకరాపేట ఘాట్లో అదుపుతప్పి ఓ ప్రైవేటు ట్రావెల్స్ కు చెందిన స్లీపర్ కోచ్ బస్సు బోల్తా పడటంతో పలువురికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. సోమవారం తెల్లవారుజామున అనంతపురం(బళ్లారి) నుంచి ప్రైవేటు స్లీపరు కోచ్ బస్సు 45మంది ప్రయాణికులతో బయలు దేరి చెన్నై వెళుతుండగా భాకరాపేట ఘాట్ లో వేగంగా దిగుతుండగా అదుపు తప్పి పక్కకు పడి పోయింది. ఈ ఘటనలో 10 మందికి తీవ్ర గాయాలయ్యాయి. 20 మంది స్వల్ప గాయాల పాలయ్యారు. రోడ్డుకు పక్కగా ఏర్పాటు చేసిన రక్షణ రెయిలింగ్ లేకుంటే బస్సు లోయలో పడిపోయి వుండేది. రెయిలింగ్ వలన పెద్ద ప్రమాదం తప్పి పోయింది. ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. క్షతగాత్రులను వివిధ 108 వాహనాల ద్వారా తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. చంద్రగిరి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వాహనం ఢీ- మేస్త్రీ మృతి

ప్రజాశక్తి - బాలాయపల్లి : నాయుడుపేట వెంకటగిరి రోడ్డు మార్గం కాసరం కాసు రోడ్డు సమీపం వద్ద గుర్తు తెలియని వాహనం ఆదివారం ఢీ కొట్టడంతో మేస్త్రీగా పనిచేస్తూ జీవనం గడుపుతున్న పారిచర్ల ధన శేఖర్ (40) అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు కథనం మేరకు తడ పట్టణం సునీత నగర్ చెందిన ధనశేఖర్ జీవనం సాగిస్తుండేవారు. వెంకటగిరిలో మేస్త్రీ పని ఉందని తల్లిదండ్రులకు చెప్పి ఆదివారం వెంకటగిరికి వచ్చాడు. రాత్రి తిరిగి వెళుతుండగా నాయుడుపేట వెంకటగిరి రోడ్డు మార్గం కాసరం సమీపం క్రాస్ రోడ్డు వద్ద మృతి చెంది రోడ్డుపై పడి ఉండడంతో గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టిందని ఎస్ఐ వీరనారాయణకు సమాచారం రావడంతో వెంకటగిరి ఆస్పత్రికి తరలించి. అతను ఫోన్ లో ఉన్న నెంబర్ సహాయంతో తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి మృతదేహం అందించామని తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో యువకుడు గల్లంతు

ప్రజాశక్తి-ఎర్రావారిపాళ్యం: చెరువులో యువకుడు గల్లంతైన సంఘటన మండలంలోని చింతగుంట పంచాయతీలో సోమవారం వెలుగులోకి వచ్చింది. స్థానికుల కథనం మేరకు.. చింతగుంట పంచాయతీ ఆదిఆంధ్రవాడకు చెందిన గణేష్ శనివారం స్థానిక రెడ్డిచెరువులో చేపలవేటకు వెళ్లి గల్లంతైనట్లు స్థానికులు వాపోయారు. ఈ విషయమై పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు.

ట్రాక్టర్ బోల్తా ..తృటిలో తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలోనే స్థానిక నందిమంగళం సమీపంలో నగరి వైపు పుత్తూరుకి కట్టెల లోడ్‌తో రోడ్డుపై వెళుతున్న ట్రాక్టర్ టైరు పంక్చర్ అయింది. దీంతో వాహనం హఠాత్తుగాబోల్తా పడింది. డ్రైవరు చాకచక్యంగా ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. రోడ్డుకు అడ్డంగా వున్న ట్రాక్టరును స్థానికుల సాయంతో పక్కకి తొలగించి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు.

వైసిపిలో హరికృష్ణ నాయుడు చేరిక

ప్రజాశక్తి-పాకాల: తుడా ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఆధ్వర్యంలో మొగరాల పంచాయతీ జంగాలపల్లికి చెందిన యువజన విభాగం నాయకుడు హరికృష్ణ నాయుడు మండలంలో చేరారు. సోమవారం చెవిరెడ్డి మోహిత్ రెడ్డి నివాసం వద్ద హరికృష్ణ నాయుడుని పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలనాదక్షత, కులం, మతం, పార్టీ, వర్గం తేడా లేకుండా సంక్షేమ పథకాలు అమలు, ప్రతి పల్లెకు అభివృద్ధి బాటలు వేసిన ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పాలకుడిగా కాకుండా నియోజకవర్గ ప్రజలకు కుటుంబ సభ్యులుగా భావించే సహకారం అందించే తత్వానికి ఆకర్షితుడై పార్టీలో చేరానని హరికృష్ణ నాయుడు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మొగరాల పార్టీ డివిజన్ అధ్యక్షులు హరిప్రసాద్ రెడ్డి, పాకాల డివిజన్ అధ్యక్షులుపం చాయ కపిలేశ్వర్ రెడ్డి, మొగరాల పంచాయతీ ఉప సర్పంచ్ నరసారెడ్డి, రాయలసీమ మోహన్, ఇతర నాయకులు సురేష్, వెంకటేష్ పాల్గొన్నారు.


ఆదినారాయణకు పుష్పగుచ్ఛం అందిస్తున్న సునీల్ చక్రవర్తి

ఇన్‌ఛార్జీ డిటిసిని కలిసిన సునీల్ చక్రవర్తి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): జిల్లా ఇన్‌ఛార్జి రవాణా శాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టిన ఆదినారాయణను రాష్ట్ర రవాణా శాఖ సభ్యులు ముత్తంశెట్టి సునీల్ చక్రవర్తి సోమవారం మర్యాద పూర్వకంగా కార్యాలయంలో కలిసి పుష్పగుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంవిఐలు సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు పాల్గొన్నారు.



లారీ ఓనర్స్ అసోసియేషన్ ఎన్నిక

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి, తొట్టంబేడు తాలూకా లారీ ఓనర్స్ అసోసియేషన్ ఎన్నిక సోమవారం నిర్వహించారు. అధ్యక్షుడిగా జయశంకర్, కార్యదర్శిగా సాయి రెడ్డి, గౌరవ అధ్యక్షుడిగా గురువారెడ్డి, ఉపాధ్యక్షుడిగా దేవిశ్రీప్రసాద్, గౌరవ సలహాదారుగా సుబ్రమణ్యం, సంయుక్త కార్యదర్శులుగా ఏ. సుబ్రహ్మణ్యం మబూబ్ ఖాన్, కోశాధికారిగా యుగంధర్ రెడ్డి, సంయుక్త కోశాధికారిగా గోపి, 14 మంది సభ్యులను ఈ సందర్భంగా ఎన్నుకున్నారు. లారీ ఓనర్స్ సమస్యలపై సంఘటితంగా పోరాడుతామని నూతన అధ్యక్షుడు జయశంకర్ తెలిపారు.